తహసీల్దార్ కావలెను!

- ఇన్‌చార్జిల పాలనలో రెవెన్యూ వ్యవస్థ
- తహసీల్దార్, ఆర్‌ఐ పోస్టుల ఖాళీ
- పేరుకుపోతున్న సమస్యలు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం


పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయం

పుల్లలచెరువు:

మండల కేంద్రం పుల్లలచెరువుకు తహసీల్దార్ లేక పోవడంతో గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలు పెరుకుపోతున్నాయి. గతంలో పనిచేస్తున్న తహసీల్దార్ నయూంఅహ్మద్ నవంబర్ నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అప్పటి నుంచి తహసీల్దార్ లేకుండా ఇన్‌చార్జిలు పాలన చేస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ఉన్న తహసీల్దార్‌లు కూడా కార్యాలయానికి రాకపోవడంతో ప్రజల సమస్యలు తీర్చేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, రైతుల సర్టిఫికెట్‌లు మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన వాటి కోసం పక్కన ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్ వద్దకు సిబ్బంది ఫైళ్ల తీసుకుని పరిగెత్తుతున్నారు. రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించండి.. అని కలెక్టర్ పదే పదే చెబుతుంటారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు రెండు ఖాళీగా నెలల తరబడి ఉన్నా ఇంత వరకు అధికారులు రెగ్యులర్ అధికారులను నియమించలేదు. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్ మార్కాపురం నుంచి రావాలి. ఆయన అసలు కార్యాలయానికి రావడం లేదు. కలెక్టర్ చెప్పిన సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలకు పరిష్కారం ఏది?

ఇటీవల కాలంలో రెండు సార్లు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. అందులో భాగంగా గ్రామాల్లోని రైతుల నుంచి దాదాపు 750 వినతి పత్రాలు అధికారులకు రైతులు అందజేశారు. ఈ రోజుకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలో వెనుకబడిన మండలమైన పుల్లలచెరువులో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. ఈ ప్రాంతంలో రెగ్యులర్ అధికారి లేకుంటే గ్రామాల్లోని రైతుల సమస్యలను పరిష్కరించే వారు కరువవుతారు.

కలెక్టర్ వచ్చారు..వెళ్లారు

గత నెల 27వ తేదీన పుల్లలచెరువులో కలెక్టర్ పర్యటించారు. ప్రజలకు ఏమీ ఉపయోగం జరుగలేదు. కలెక్టర్ వచ్చారని ప్రజలు తెలుసుకుని సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లేలోపే ఆమె వెళ్లిపోయారు. చేసేది లేక ప్రజలు మిన్నకుండిపోయారు. రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో వీఆర్వోలు కూడా అంతంతమాత్రంగా పనిచేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నా పొలం 90 ఎకరాలుగా చూపుతోంది:



గ్రామంలో రీ సర్వే చేసిన తర్వాత నాకు ఉన్న పొలంలో నాలుగు ఎకరాలకు బదులు 90 ఎకరాలుగా నమోదైంది. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తప్పు అచ్చయింది. మార్చమని గ్రామ సభలో అర్జీ ఇచ్చా. ఇంత వరకు సమస్య పరిష్కరించలేదు. దీనివల్ల నాకు బ్యాంకులో రుణం రావడం లేదు. అధికారులు పట్టించుకోకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి.

ఎస్.కేశవనారాయణరెడ్డి, రైతు, కవలకుంట్ల

1–బీలు రావడం లేదు:



మాకు చౌటపల్లి ఇలాకాలో పొలం ఉంది. ఈ గ్రామంలో ఇటీవల రీ సర్వే చేశారు. అప్పటి నుంచి మా నంబర్లన్నీ ఎల్‌పీఎంలో ఉన్నాయి. మా నంబర్లకు సంబంధించి ఒరిజినల్ 1–బీలు రావడం లేదు. గ్రామసభలో అధికారులకు సరి చేయమని అర్జీ ఇచ్చాం. నెలలు గడుస్తున్నా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు. పత్రాలు లేక పోవడంతో చాలా ఇబ్బందు పడుతున్నాం.

పి.కృష్ణారావు, రైతు, పుల్లలచెరువు

తహసీల్దార్‌ను నియమించాలి:



పుల్లలచెరువుకు నెలల తరబడి రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సామాన్య ప్రజలు సమస్యలు చెప్పకోవడానికి ప్రతిసారి జిల్లా కేంద్రానికి వెళ్లలేరు. రెవెన్యూ సమస్యలు ఎక్కువగా పెరుకు పోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ గమనించి రెగ్యులర్ తహసీల్దార్‌ను తక్షణమే నియమించాలి.

జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి, పుల్లలచెరువు

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి


పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి


ముండ్లమూరు: మాట్లాడుతున్న ఏఓ ఫరూక్

పెద్దారవీడు: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండలంలోని పుచ్చకాయలపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజు రోజుకూ రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అదే ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సుస్థిర దిగుబడులు వస్తాయని, పెట్టుబడి ఖర్చు కూడా తక్కువేనని చెప్పారు. ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబర్ పొందాలని, వెంటనే రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మట్టి నమూనా పరీక్షల గురించి వివరించారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగానే జింక్, జిప్సం సబ్సిడీపై ఇస్తామని చెప్పారు. వీఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని ఏఈఓ ధనీశ్వర్‌నాయక్ అన్నారు. మండలంలోని రామసముద్రం, మిట్టపాలెం గ్రామ రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంట చుట్టూ రెండు వరుసల్లో జొన్న పైరు వేస్తే కొంత వరకు రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. పొలం ఉన్న ప్రతి రైతు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని చెప్పారు. వీఏఏలు జి. అచ్యుతరావు, ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): ఫార్మర్ రిజిస్ట్రేషన్ మార్చి 31వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ సూచించారు. మండలంలోని శంకరాపురం, నూజెళ్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,447 పీఎం కిసాన్ లబ్ధిదారులకుగాను కేవలం 5,262 మంది రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విధి విధానాల ప్రకారం మార్చి 31వ తేదీ లోపు 75 శాతం పీఎం కిసాన్ లబ్ధిదారులను నమోదు చేయాలన్నారు. ఇంకా ఏపీఎఫ్ఆర్ నందు నమోదు కాని రైతులు మీ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరారు.

సాగర్ పైప్‌లైన్ పనులు సత్వరమే చేపట్టాలి


నిలిచిన పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పొదిలి: పొదిలికి సాగర్ జలాలు తరలించే పైప్ లైన్ పనులను సత్వరమే చేపట్టాలని సీపీఎం కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. అర్ధంతరంగా నిలిచిన పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పొదిలి పట్టణ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాత్రులు నిద్ర మానుకుని, పగలు పనులు మానుకుని వేచి చూస్తూ, నీరు వచ్చినపుడు ఒక బిందె పట్టుకునే పరిస్థితి ఉందన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలోని పంప్ హౌస్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర సాగర్ కుళాయిలకు నీరు వస్తుంటే పట్టుకోవడమే తప్ప, పైపులైన్లలో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచినీటి పథకం కోసం రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసి, పనులను చేపట్టగా ఎన్నికల వేళ నిలిచిపోయాయన్నారు. ఆగిపోయిన పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు తొమ్మిది నెలలు గడుస్తున్నా పనులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తగినన్ని నిధులు కేటాయించి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, జి.నరసింహారావు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తీసుకోవాలి


మూగచింతలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గిద్దలూరు రూరల్: రైతులు ధాన్యం నిల్వలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నరవ గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ఆహార ధాన్యాలను నిల్వ చేసుకోవడంలో అవగాహన లేకపోవడం వల్ల 10 శాతం మేర నష్టపోతున్నారన్నారు. వేపగింజల పొడి ఉపయోగించి వరి, శనగ, కందులు తదితర పంట ఉత్పత్తులను కీటకాల బారినపడకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఛేఓ ఎస్కే జైన్‌లాబ్దిన్ సూచించారు. బుధవారం పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం గ్రామాల్లో రైతులకు అవగహన కల్పించారు. రాయితీపై పనిముట్లు అవసరమైన వారు వీఏఏల వద్ద దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు.

సునీతా విలియం చిత్రపటానికి క్షీరాభిషేకం

దర్శి: స్థానిక గురుకుల పాఠశాల, కళాశాలలో అంతరిక్ష వ్యోమగామి సునీతా విలియమ్స్ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పర్యవేక్షణ అధికారి, జూనియర్ అసిస్టెంట్‌లు సత్యనారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ అంతరిక్షంలో పరిశోధన కోసం వెళ్లి 9 నెలలు పాటు అక్కడే ఉండి సముద్రంలో సురక్షితంగా దిగి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహిళ సునీతా విలియమ్స్ అని కొనియాడారు. అటువంటి గొప్ప శాస్త్రవేత్త మన భారత సంతతికి చెందిన వ్యక్తి కావడం నిజంగా దేశం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల, కళాశాల పీడీ ఆదిశేషు, పీఈటీ బొడ్డు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీతిరుపతమ్మ తల్లి తిరునాళ్ల


స్వామి వార్లు

కురిచేడు: మండలంలోని పేరంబొట్లవారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా జరగనుంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కళ్యాణం నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ నాయకులు బుధవారం తెలిపారు. స్థానిక మాచర్ల రోడ్డులోని ముస్లిం షాదీఖానాలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగే నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ముస్లింలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

మొగిలిగుండాల రిజర్వాయర్ పూర్తి చేయాలి

తాళ్లూరు: మండలంలోని మొగిలిగుండాల రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ ఆఫీస్ వద్ద బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు సరఫరా చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులు తొలగించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. వైజాగ్ క్రికెట్ స్టేడియానికి ఉన్న వైఎస్సార్ పేరును టీడీపీ నేతలు తొలగించడాన్ని ఆయన తప్పుబట్టారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లు శివారు ఓ కోళ్ల ఫారంలో 13.81 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుచేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ తెలిపారు. అధికారులకు అందిన సమాచారం మేరకు కోళ్ల ఫారంలో తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ మూర్తి, వీఆర్ఏ దయానంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొల్లికొండ్రాయ స్వామి తిరునాళ్ల


బొల్లికొండ్రాయస్వామి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం, ఆవులమంద, కల్లూరు గ్రామాల కూడలిలో కొండపై వేంచేసి ఉన్న శ్రీ బొల్లికొండ్రాయస్వామి తిరునాళ్ల బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారికి పొంగళ్ల నైవేద్యం చేసి నివేదించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రికి 7 విద్యుత్ ప్రభలు, రెండు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు.

నివాసాల్లో సీసీ కెమెరాలు బిగించుకోండి


మాట్లాడుతున్న ఎస్సై మురళి

దర్శి: నివాసాల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలని ఎస్సై మురళి సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నివాసంలో సీసీ కెమెరా ఉంటే ఇంట్లో ఒక కానిస్టేబుల్ ఉన్నట్లేనని చెప్పారు. నివాసంలో టీవీలు, ఏసీలు ఎలా ఉపయోగించుకుంటారో సీసీ కెమెరాలు కూడా అలా అమర్చుకోవాలని సూచించారు. అన్నీ బిజినెస్‌లు, బ్యాంక్‌లు, ఇతర వ్యాపారాలు ఉన్న వారు షాపుల్లో కూడా తప్పని సరిగా సీసీ కెమెరాలు బిగించుకోవాలని చెప్పారు. రూ.20 వేలు పెట్టుకుంటే మంచి సీసీ కెమెరాలు వస్తాయని, అవి మన నివాసాన్ని ఐదు నుంచి పదేళ్ల కాపాడతాయన్నారు. ఏవైనా దొంగతనాలు జరిగినప్పుడు అవి మనకు రక్షణగా నిలుస్తాయని చెప్పారు.

కేజీబీవీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

దర్శి: కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికలు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 మంది, ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరానికి 40 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్‌లకు పరిగణిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు 99663 66175 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

కురిచేడు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి తెలిపారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 7,8,9,10,12 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంఘాల అభివృద్ధికి ఐక్యంగా పాటుపడదాం


సమావేశానికి హాజరైన పాస్టర్లు

యర్రగొండపాలెం: ఐక్యంగా పనిచేస్తేనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా తామందరం కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించుకుందామని నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సన్నెపోగు సుందరరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలోని క్రీస్తు సంఘ భవనంలో జరిగిన పాస్టర్ల కార్యవర్గ సమావేశం, నెలవారీ సహవాస కూడిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటి గురించి చర్చించి పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, పాస్టర్లు డగ్లస్, రావూరి ఆనందరావు, చాట్ల గంగయ్య, కొండెపోగు సామేలు, వీరదాసు ఆశీర్వాదం, పరిమి కృపసత్యం, భవనాసి వెంకటయ్య, దుగ్గెం కనకరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు దరఖాస్తు చేసుకోండి


వివరాలు వెల్లడిస్తున్న ఏఓ మధుబాబు

కురిచేడు: మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. వ్యవసాయశాఖ ద్వారా ఎఫ్ఎం పథకంలో భాగంగా రైతులకు రాయితీతో కూడిన వ్యవసాయ పనిముట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. మండలానికి రూ.4.461 లక్షల సబ్సిడీ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ సామాన్లు, మందు పంపులు, పీవీసీ పైపులు వంటివి ప్రభుత్వ రాయితీలో పొందవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఏఓ మధుబాబు సూచించారు.

డ్రోన్‌తో పది పరీక్షల పర్యవేక్షణ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

పుల్లలచెరువు: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలైన పుల్లలచెరువు, పీవీపల్లి జెడ్పీ పాఠశాలల్లోని ఆవరణను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామని, దీంతో ఆ ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే తెలిసిపోతుందని తెలిపారు. బయట వ్యక్తులు ఎవరు వచ్చినా, ఎలాంటి గొడవలు జరిగినా తెలుసుకోవడం చాలా సులువుగా ఉంటుందని ఎస్‌ఐ సంపత్‌కుమార్ వివరించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

- ఇద్దరికి తీవ్రగాయాలు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న సూర్య సత్యనారాయణ

యర్రగొండపాలెం: మోటారు బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం స్థానిక అనకుంట వద్ద జరిగింది. మండలంలోని కొలుకుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చంటి మోటారు బైక్‌పై పెద్దారవీడు మండలం కుంటకు వెళ్తున్నాడు. అమానిగుడిపాడు నుంచి యర్రగొండపాలెం వస్తున్న ఆటో అనకుంట వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మోటారు బైక్‌పై వెళ్తున్న చంటి, ఆటోలో ప్రయాణం చేస్తున్న సూర్య సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందిన వీరు మెరుగైన వైద్యం కోసం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషిద్ధం


చిరు వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని కమిషనర్ ఐ.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని తోపుడు బండ్లు, కిరాణా షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. కూరగాయలు, ఇతర వస్తువులను గుడ్డ సంచుల్లో తీసుకెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, నాగార్జున, సిబ్బంది ఉన్నారు.